సర్వత్రా న్యూ ఇయర్ సందడి

- నూతన సంవత్సరం స్వాగతానికి ఏర్పాట్లు
- బేకరీలు, మిఠాయి దుకాణాలలో సందడి
- పూల దండలు, బొకేలు సిద్ధం
- రాజకీయ నాయకుల విందు ఏర్పాట్లు


సామర్లకోట వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న దవులూరి దొరబాబు


సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పండ్లు


సామర్లకోట మఠం సెంటర్‌లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన రంగులు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న పుష్పగుచ్ఛాలు

సామర్లకోట: నూతన సంవత్సరం 2024కు స్వాగతం చెప్పడానికి సర్వత్రా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఎన్నికల ఏడాది కావడంతో పోటీ చేసే అభ్యర్థులు వచ్చే వారికి విందు అందించడానికి ఏర్పాట్లు సిద్ధం చేశారు. వ్యాపార సంస్థలు వినియోగదారులను ఆకర్షించేలా కేక్‌లు, మిఠాయిలు, పూల దండలు, బొకేలు సిద్ధం చేశారు. మహిళలు నూతన సంవత్సరానికి స్వాగతం చెప్తూ ముగ్గులు వేశారు. బేకరీలలో అర కేజీ నుంచి 20 కేజీల వరకు కేక్‌లను సిద్ధం చేశారు. పూల వ్యాపారులు రూ.50 నుంచి రూ.500 వరకు విక్రయించడానికి బొకేలను తయారు చేస్తున్నారు. హోటళ్లను విద్యుద్దీపాలతో అలంకరించి వివిధ మెనూలను సిద్ధం చేశారు. ఏడాది చివరి రోజు ఆదివారం కావడంతో మాంసం ప్రియులతో హోటళ్లు నిండిపోయాయి.

ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద..

నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రాజకీయ నాయకులు ఇళ్ల వద్ద సందడి నెలకొంది. పెద్దాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తనకు శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చే సుమారు 20 వేల మందికి అభిమానులకు స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద భోజనాలు పెట్టేందుకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అచ్చంపేటలోని ఆయన స్వగృహంలోను ఏర్పాట్లు చేశారు. అయితే జనసేన నాయకుడు తుమ్మల బాబు నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉంటున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్, రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరీ, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావుల ఇళ్ల వద్ద అభిమానుల రాక కోసం ఏర్పాట్లు చేశారు.

సందడే సందడి

పిఠాపురం: సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించడానికి రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద హడావుడి ప్రారంభమైంది. అయితే ఎమ్మెల్యే పెండెం దొరబాబు తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లినందువల్ల నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉన్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. మరోవైపు కొత్త సంవత్సర వేడుకల నేపథ్యంలో పూలు, బేకరీలు, స్వీట్ల దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. నూతన సంవత్సర వేడుకల కోసం ప్రత్యేకంగా తయారుచేసిన పుష్పగుచ్ఛాల దుకాణాలు పిఠాపురం పట్టణంతో పాటు గొల్లప్రోలు, కొత్తపల్లి గ్రామాల్లో వెలిశాయి.

నాణ్యమైన వరి నారుతో మంచి దిగుబడులు


రైతులకు సూచనలిస్తున్న ఏఓ జోగిరాజు

కొత్తపల్లి: నాణ్యమైన వరి నారు నాటితే రైతులకు మంచి దిగుబడులొచ్చే అవకాశం ఉందని మండల వ్యవసాయశాఖాధికారి జోగిరాజు అన్నారు. ఆదివారం ఆయన వరి నారు సంరక్షణ, నాటే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడి 10–12 రోజుల వ్యవధిలో 3 దఫాలు దుక్కులు దున్ని చదును చేయాలన్నారు. నీరు పెట్టడానికి, తీయడానికి అనుకూలంగా ఉన్న మడులను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. విత్తన సమయంలోనే కిలో భాస్వరం, కిలో పొటాష్ వేసుకోవాలని, మొలకకట్టిన విత్తనాలను సెంటు నారుమడికి 5 కిలోలు చొప్పున వేసుకోవాలని సూచించారు. నారుమడిలో జింక్ లోపం గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేయాలన్నారు. నాటు వేసేటప్పుడు స్వల్పకాలిక రకాలకు చదరపు మీటరుకు 66 కుదుళ్ళు, మధ్యకాలిక రకాలకు 44 కుదుళ్ళు, దీర్ఘకాలిక రకాలకు 33 కుదుళ్ళు ఉండేలా చూసుకోవాలని చెప్పారు.

అయోధ్య రాముని అక్షతల పంపిణీ


పీబీ దేవంలో పంపిణీకి అక్షతలను సిద్ధం చేస్తున్న రామకృష్ణ సేవా సమితి సభ్యులు

సామర్లకోట: అయోధ్య రామ మందిరంలో పూజలు చేసిన అక్షతలను ఆదివారం ఇంటింటా పంపిణీ చేశారు. పీబీ దేవం గ్రామంలో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఇంటింట పంపిణీకి ప్యాకెట్లు సిద్ధం చేసినట్టు సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ తెలిపారు. గ్రామంలో 2,500 హిందూ కుటుంబాలను గుర్తించామని, సోమవారం నుంచి ఏడో తేదీ వరకు ఇంటింటా పంపిణీ ఉంటుందని చెప్పారు. సేవా సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, సభ్యులు పాల్గొన్నారు.

సత్తెమ్మ సంబరానికి ఏర్పాట్లు

వైస్ చైర్మన్‌చే గరగ ఉత్సవం ప్రారంభం


పెద్దాపురం సత్తెమ్మ ఆలయంలో గరగను తీసుకువస్తున్న సాయి ప్రసాద్

పెద్దాపురం: ఏటా కనుమ రోజున నిర్వహించే స్థానిక సత్తెమ్మ తల్లి సంబరానికి ఆదివారం ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఆలయ నిర్వాహకులు పప్పుల పెద్ద, నాగరాజుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించగా మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్‌చే అమ్మవారి గరగను తీయించి ఉత్సవం నిర్వహించారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గరగల నృత్యం, ఉయ్యాల తాళ్ల ఉత్సవాన్ని నిర్వహించారు.

శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్ల అందజేత


శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందుకున్న మహిళలు

కొత్తపల్లి: మండలంలోని కేఎస్ఈజెడ్‌లో ఉన్న మహిళా నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలు, యువతీ యువకులకు ఆదివారం సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్ మాట్లాడుతూ నిపుణులైన శిక్షకులతో బేసిక్ కంప్యూటర్ ప్రోగ్రాం, కుట్టుమిషన్, చీరలపై పెయింటింగ్, డిజైనర్ జాకెట్ల తయారీ తదితర అంశాల్లో అరబిందో ఫౌండేషన్ అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. సెజ్ పరిధిలోని రెండు నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో సుమారు 78 మందికి టైలరింగ్‌పై శిక్షణనిచ్చామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కనక మహాలక్ష్మి రథోత్సవం


కనక మహాలక్ష్మి అమ్మవారి రథోత్సవం

ఆకట్టుకున్న రామదండు వేషధారణలు


రథోత్సవంలో రామదండు వేషధారణలు

సామర్లకోట: స్థానిక బళ్లమార్కెట్‌లోని గ్రామ దేవత కనక మహాలక్ష్మి అమ్మ వారి రథోత్సవం ఆదివారం జరిగింది. ఏటా మార్గశిర మాసంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. నీలిమ రెస్టారెంట్ అధినేత అమలకంటి శ్రీనివాసరావు అమ్మ వారికి లడ్డును నైవేద్యంగా అందజేశారు. ఆలయ పండితులు సన్నిధిరాజు సూర్య భాస్కరరావు, అంజిబాబుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి రథోత్సవం నిర్వహించారు. అమ్మవారిని దారిపొడవునా భక్తులు దర్శించుకున్నారు. గరగ నృత్యాలు, రామదండు వేషాలు, మ్యూజికల్ బ్యాండ్‌లను ఏర్పాటు చేశారు. చిట్టూరి సుబ్బారావు దంపతుల ఆధ్వర్యంలో రథాలంకరణ జరిగింది. ఈనెల 4వ తేదీ గణపతి పూజ, కుంకుమ పూజ, సాయంత్రం లక్ష పుష్పార్చన, అనంతరం అఖండ దీపారాధన నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ గ్రంధి వాసు, వైస్ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి శ్రీనివాసు, కమిటీ సభ్యులు భక్తులకు సేవలందించారు.

22న రామదండు..

అయోధ్యలో రామాలయం ప్రారంభం సందర్భంగా కనక మహాలక్ష్మి బాలమిత్ర సమాజం వారిచే రామదండు, రథోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు.

సామాజిక భద్రతకు కేంద్ర ప్రభుత్వం కృషి


వికసిత్ భారత్ యాత్రలో ప్రసంగిస్తున్న ఈఓపీఆర్‌డీ రాజశేఖర్


పెద్దాపురం: పేదలకు సామాజిక భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ అన్నారు. వికసిత్ భారత్ యాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని పులిమేరు, మర్లావ గ్రామాల్లో బహిరంగ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి బీవీవీ రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈఓ పీఆర్డీ రాజశేఖర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరిస్తున్నట్టు తెలిపారు. ప్రధాన మంత్రి స్వనిధి, పీఎం జనధన్, అటల్ పెన్షన్ యోజన, జీవనజ్యోతి తదితర పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. బీజేపీ నాయకులు తుమ్మల పద్మజాలక్ష్మి, విత్తనాల వెంకటరమణ మాట్లాడుతూ ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన ద్వారా కుల వృత్తిదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలు పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తుమ్మల అచ్యుతరామయ్య, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అమృత్ భారత్ రైలుకు స్వాగతం


అమృత్ భారత్ రైలుకు స్వాగతం పలికిన నాయకులు, అధికారులు

సామర్లకోట: రైల్వే శాఖ కొత్తగా ప్రవేశపెట్టిన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌కు సామర్లకోటలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా టౌన్ నుంచి బెంగళూరు వెళ్తున్న ఈ రైలు ట్రయల్ రన్‌గా ఆదివారం సాయంత్రం ఇక్కడకు చేరుకుంది. దీనికి బీజేపీ నాయకులు, రైల్వే ఉద్యోగులు స్వాగతం పలికారు. ఈ రైలులో 12 నాన్ ఏసీ, 8 సాధారణ బోగీలు ఉంటాయని స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. పేద ప్రజల సౌకర్యార్థం ప్రధాని నరేంద్ర మోదీ ఈ రైలును ప్రారంభించారని బీజేపీ నాయకులు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఏడీ ఈఎన్ శివప్రసాద్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, ఆర్‌పీఎఫ్ ఎస్సై ఎన్.రామకృష్ణ, స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీదేవి, బీజేపీ నాయకులు వైటూరి సూర్యనారాయణరాజు, మాలకొండయ్య, ప్రయాణికుల సలహా మండలి సభ్యులు వైడీ రామారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు ఎస్ఐగా బాలాజీ


బాధ్యతలు స్వీకరిస్తున్న బాలాజీ

పిఠాపురం: గొల్లప్రోలు ఎస్ఐగా ఎ.బాలాజీ ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాకినాడ నుంచి ఇక్కడకు బదిలీపై రాగా ఇంతకాలం ఇక్కడ పనిచేసిన ఎస్ఐ వినయ్‌ప్రతాప్ బదిలీపై కాకినాడ వెళ్లారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేస్తానని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ బాలాజీ తెలిపారు.

రత్నగిరికి భక్తుల తాకిడి

- సత్యదేవుని దర్శించిన 25 వేల మంది
- దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం


సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. 2023 ఆంగ్ల సంవత్సరంలో ఇదే చివరి రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనానికి భక్తులు తరలి వచ్చారు. దీంతో సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో ఉదయం ఐదు గంటల నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ. 25 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు నాలుగు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని సోమవారం దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొనే అవకాశం ఉంది.

సత్యదేవునికి జన్మనక్షత్ర పూజలు

సత్యదేవుని జన్మనక్షత్రం 'మఖ' సందర్భంగా ఆదివారం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరుల మూలవిరాట్‌లకు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు యాగశాలలో స్వామివారికి ఆయుష్యహోమం నిర్వహించారు. పండితులు తెల్లవారుజామున రెండు గంటలకు స్వామివారి ఆలయాన్ని తెరిచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పంచామృతాలతో మహాన్యాశ పూర్వక అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను స్వర్ణాభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు.